క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



మక్తల్: మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో జీపీల్లో విధులు నిర్వహిస్తూ పదోన్నత పొందిన ఉపాధ్యాయులు శాంతలక్ష్మి నేరడుగోమ్‌కు, కుర్మయ్య ముడుమాల్ పాఠశాలకు, తిరుమల్‌రావు చంద్రోఖర్, చంద్రశేఖర్‌లు గుడేబల్లూర్‌కు బదిలీ అయ్యారు. వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంఈఓ అనిల్‌గౌడ్, ఉపాధ్యాయులు దీప, బాబు, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాగనూర్: మండల పరిధిలోని నేరడగం పెద్ద వాగు నుంచి అదే గ్రామానికి చెందిన కాళప్ప, సురేష్‌లు అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా పట్టుకుని ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పి.అశోక్‌బాబు తెలిపారు. నేరడగం వాగు నుంచి నిత్యం అక్రమంగా ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఇద్దరు వ్యక్తులపై విశ్వసనీయ సమాచారం మేరకు డయల్ 100 సిబ్బంది ఆధ్వర్యంలో పట్టుకున్నట్లు తెలిపారు. సంబంధిత ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

రైతులు చట్టాల గురించి తెలుసుకోవాలి



నారాయణపేట రూరల్: చట్టాలపై రైతులు, గ్రామీణ ప్రాంత ప్రజలు పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జలల్ పూర్ లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు సంబంధించి చట్టాలు ఉన్నాయని తెలిపారు. రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకొని భూమిని బట్టి పంటలు సాగు చేయాలన్నారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100కు ఫోన్ చేయడం వల్ల సమస్యలకు పరిష్కారం దొరు కుతుందన్నారు. విద్యార్థులు మొబైల్ వాడకం తగ్గించి చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ లక్ష్మీపతి గౌడ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ నాగేశ్వరి, పంచాయతీ కార్యదర్శి కీర్తి పాల్గొన్నారు.

మాలమహానాడు నాయకుల ముందస్తు అరెస్టు



మాగనూర్: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా చేయాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో మాలమహానాడు నాయకులను మాగనూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భైరంపల్లి నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయ కులు గోపాల్, భాస్కర్, రాఘవేంద్ర, మహేష్, రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మాధవ్‌ను సన్మానించిన అంబేడ్కర్ జాతర కమిటీ

నారాయణపేట: జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన టి.మాధవ్‌ను గురువారం అంబేడ్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ జాతర కమిటీ ప్రధాన కార్యదర్శి ఈశ్వరమ్మ, నాయకులు రమేష్, చంటి, పాండు, హనుమంతు పాల్గొన్నారు.

కృష్ణా మండలం ప్రెస్‌క్లబ్ ఎన్నిక

కృష్ణా: మండల కేంద్రంలోని క్షీరాలింగేశ్వర ఆలయంలో గురువారం మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా కుస్సీ అశోక్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా సురేష్, నాగేంద్ర, ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు, కోశాధికారిగా చెన్నయ్యగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. అనంతరం కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యలపై తాము పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో మండల పాత్రికేయులు కతలప్ప, జగన్నాథ్, శ్రీనివాసులు, రాజు, శేఖర్‌గౌడ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో ఇష్టారాజ్యం



మక్తల్ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం

ప్రైవేట్ వ్యక్తులకు సామగ్రి తరలింపు

- దావతులకే అధికారులు పరిమితం
- సమావేశాలకు డుమ్మా..
- లైన్‌మెన్‌లపై ఉన్నతాధికారుల పెత్తనం

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం పల్లెప్రగతి, పట్టణ ప్రగతి పేరుతో గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపేందుకు విద్యుత్ సామగ్రిని విచ్చలవిడిగా మంజూరు చేసింది. ఏ గ్రామంలో ఎంత మంజూరు చేశారు, పల్లెకు ఎంత, గల్లికి ఎంత అనే విషయం కాంట్రాక్టర్లకు, అధికారులకు మాత్రమే తెలుసు. మూడో కంటికి కనిపించకుండా విద్యుత్ సామగ్రి వెళ్తోంది. గ్రామాలకు మంజూరైన కరెంటు స్తంభాలు పక్కదారి పట్టి ప్రైవేటు వ్యక్తులకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు అమ్ముకున్నట్లు విశ్వసనీయ సమాచారం. గ్రామాలకు విద్యుత్ తీగలు, ఇతర సామగ్రి అడిగితే కాంట్రాక్టర్లు వస్తారు, చేస్తారు అని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. మక్తల్ విద్యుత్ సబ్‌స్టేషన్లలో కాంట్రాక్టర్లు, విద్యుత్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో సమస్యలు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని డీడీలు కట్టినా నేటి వరకు రైతులకు అందడంలేదు. జిల్లా ఉన్నత స్థాయి అధికారుల సహకారంతో కాంట్రాక్టర్లు కరెంట్ సామగ్రి ఎక్కడి వెళ్తోందో ఎవరికీ తెలియదు. విద్యుత్ సామగ్రి వాహనం మక్తల్‌కు వస్తే చాలు ఏ కాంట్రాక్టర్‌కు ఎంత పనులు ఇవ్వాలని అధికారులు లెక్కలు వేసి పనులు అప్పగిస్తున్నారు. సకల మర్యాదలు చేసిన కాంట్రాక్టర్‌కే టెండర్ పలుకుతుందని పలువురు పేర్కొంటున్నారు. మక్తల్ సబ్‌స్టేషన్‌లో కరెంట్ విషయం తీస్తేచాలు ఇక చెప్పనవసరం లేదు. మక్తల్‌కు కూతవేటు దూరంలో ఉన్న సబ్‌స్టేషన్‌లో ఏం చేసినా ఎవరికీ సమాచారం తెలియదు. కొందరు లైన్‌మెన్లు కాంట్రాక్టర్ల, అధికారుల మాటలు వినపోతే వారి 'అంతుచూస్తాం' అంటూ బెదిస్తున్నారు. మక్తల్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ అధికారులు మండల సర్వసభ సమావేశాలకు డుమ్మా కొడుతున్నారు. ఏ గ్రామానికి ఎన్ని స్తంభాలు మంజూరయ్యాయి. వివరాలు సేకరిస్తే అసలు దొంగలు కాంట్రాక్టర్లా, అధికారులా? అనే విషయం తెలుస్తుంది. మక్తల్ సబ్‌స్టేషన్‌ల్లో జిల్లా ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేపడితే అసలు విషయం బయటపడుతుంది.

> **బాధ్యులపై చర్యలు తీసుకుంటాం..**
>
> గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు అవసరమైన చోట వేయకుండా, పనులు ఇష్టానుసారంగా చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. విద్యుత్ సామగ్రి ఏ గ్రామానికి ఎన్ని స్తంభాలు, ఎన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని పూర్తి స్థాయిల్లో విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో లైన్‌మెన్లు పొరపాటు చేస్తే చర్యలు ఉంటాయి. పల్లెప్రగతిలో ఉన్న సమాచారం తెలుసుకుంటాం. విచారణలో తెలితే చర్యలు తీసుకుంటాం.
>
> – రామకృష్ణ, విద్యుత్ ఏఈ, మక్తల్

బాలల హక్కులపై అవగాహన



హైస్కూల్‌లో విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న చైల్డ్ వెల్ఫేర్ అధికారులు

మాగనూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్స్ సౌకర్యార్థం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో పిల్లల సమస్యలు, వాటి పరిష్కార వివరాలు సేకరిస్తున్నట్లు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ చైర్ పర్సన్ అశోక్‌శ్యామల తెలిపారు. మాగనూర్ హైస్కూల్‌లో ఆర్ఫన్ పిల్లలు 11 మంది, సెమియర్ ఫ్రెండ్ పిల్లలు 59 మంది ఉన్నట్లు ఆమె తెలిపారు. సీడబ్ల్యూసీ బెంచ్ పిల్లల సమస్యలను నారాయణపేటకు పిలిపించి కనుక్కోవడం ఎందుకని, నేరుగా పాఠశాలకు వచ్చి సమస్యలను పరిష్కరిద్దామని గురువారం పాఠశాలకు వచ్చినట్లు ఆమె తెలిపారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్ఫన్ పిల్లలకు ఆర్థిక సాయం అందిస్తోందని, వారికి ఈ అవకాశాన్ని చేరవేస్తామని అన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ తిరుపతయ్య, చైల్డ్ హోం కోఆర్డినేటర్ నర్సింహులు, లీగల్ ఆఫీసర్ కవిత, విద్య, బాలరాజు, సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'108' ఉద్యోగులకు జాతీయ అవార్డులు



నారాయణపేట: 108లో పదేళ్లుగా ఎమర్జెన్సీ సేవలు అందిస్తున్న మండల కేంద్రంలో టెక్నీషియన్ రాజ్ కుమార్, పైలెట్ శ్రీనివాస్‌లు జాతీయ స్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం జీవీకే ఈఎంఆర్ఐ ఫౌండర్ చైర్మన్ జీవీ కృష్ణారెడ్డి, తెలంగాణ రాష్ట్ర 108 స్టేట్ హెడ్ ఖలీద్ చేతుల మీదుగా హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్లో అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రం నుంచి నియోనేటల్ అంబులెన్స్‌లో 'నవజాత శిశువును' రక్షించినందుకు జాతీయ స్థాయిలో ఉత్తమ 108 ఉద్యోగి అవార్డును వారు అందుకున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం అధికారి రవికుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి రాఘవేందర్‌లు తెలిపారు. ఉత్తమ అవార్డు పొందిన వారిని అభినందించారు.

'మాకు పాఠాలు చెప్పేదెవరు?'



పది విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ మనోరంజని

మరికల్: మండలంలోని పస్పుల కేజీబీవీ పాఠశాలను గురువారం ఎంఈఓ మనోరంజని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు రాబోయే వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆమె మాట్లాడుతుండగా, తమకు పాఠాలు చెప్పే టీచర్లు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినీయులు ఎంఈఓ ఎదుట ప్రస్తావించారు. కేజీబీవీ ఉపాధ్యాయులు ధర్నాలో ఉండటం వల్ల పాఠ్యాంశాలు పూర్తి కాలేదని, పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో తెలియని పరిస్థితి ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సిలబస్ పూర్తి చేసేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు.

➪ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తహసీల్దార్ జమీల్ అన్నారు. మరికల్‌లో కొనసాగుతున్న కోటకొండ మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక

మాగనూర్: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో బూత్ కమిటీ అధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలంగా ఉంటేనే స్థానిక ఎన్నికల్లో ముందుకు వెళ్తామన్నారు. ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో బలంగా ఉన్నప్పుడే పార్టీ నాయకత్వం బలంగా మారుతుందన్నారు. ప్రతి గ్రామంలో బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

ఊట్కూరు: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం వికలాంగుల, వయోవృద్ధుల డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వలంటీర్లు లక్ష్మీకాంత్, సంధ్య మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు వాడటం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. వాటి వల్ల వచ్చే రోగాల గురించి వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడ్డ వారు భవిష్యత్‌లో ఆర్థికంగా, ఆరోగ్యంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురి అవుతారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయులు సంగీత, ప్రేమకుమారి, పారిజాత, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్‌లో మాజీ సర్పంచ్ భీంరెడ్డి తండ్రి వారం రోజుల క్రితం తేనే టీగలు దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలియడంతో గురువారం మాజీ ఎమ్మెల్యే చిట్యం రామ్మోహన్‌రెడ్డి బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీ వెంకటరామారెడ్డి, భీంరెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న మధ్యాహ్నభోజన కార్మికులు

నారాయణపేట: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులతో పాటు కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు యాదమ్మ, మహాదేవమ్మ, జ్యోతి, రామేశ్వరి, ఫాతిమా, సాదిక్ ఖాతున్, సరళ, భారతి ఉన్నారు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తపల్లి: కొత్తపల్లి మండల కేంద్రంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ బాల్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిసర గ్రామాల రైతులు, గృహ, వ్యాపార వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



శివాలయంలో అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న స్వాములు

నర్వ: మండల కేంద్రంలో అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం గురువారం అయ్యప్ప మాలధారులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయంలో ఉదయం గణపతిపూజ, హోమం, మధ్యాహ్నం అయ్యప్ప స్వామి మెట్లపూజను మాకం నర్సింహులు అమరచింత గురుస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభంగా నిర్వహించారు. ప్రత్యేక ఆర్కెస్ట్రా బృందంతో అయ్యప్ప గేయాల ఆలాపన భక్తులను తన్మయత్వానికి గురిచేసింది. ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ హన్మంతురెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాములకు, భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో శివాలయ అర్చకులు సిద్దయ్య, గ్రామస్తులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

కొత్తపల్లి: కోడంగల్ మాజీ శాసన సభ్యులు పట్నం నరేందర్‌రెడ్డి జైలు నుంచి విడుదలవుతున్న సందర్భంగా గురువారం కొత్తపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబరాలు నిర్వహించారు. దుద్యాల మండలంలోని లగచర్ల రైతులకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించి నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా జైలుకు పంపడంతో బుధవారం 24 మంది రైతులతో పాటు నరేందర్‌రెడ్డికి బెయిల్ రావడంతో సంబరాలు నిర్వహించారు.

డీఎస్సీ 2024 ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి



మక్తల్‌లో ట్రెజరీ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మక్తల్: నూతనంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన 2024 ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలని గురువారం మక్తల్‌లో ట్రెజరీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. నూతన ఉపాధ్యాయులకు మూడు నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మక్తల్, మాగనూర్, కృష్ణ మండలాల ఉపాధ్యాయులు, తపస్ మండల అధ్యక్షుడు రవీందర్, బాబురెడ్డి, నర్సింహులు, ప్రధాన కార్యదర్శి రాకేష ప్రహ్లాద్, నర్సింహ, రామాంజనేయులు, కురుమయ్య, జగదీస్, వెంకటయ్య, రవి, శివరాజ్, సురేష్ పాల్గొన్నారు.

వికలాంగుల రాజకీయ రిజర్వేషన్లపై ఎమ్మెల్యేకు వినతి



హైదరాబాద్‌లో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు

ఊట్కూరు: వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని గురువారం వికలాంగుల రాజ్యాధికార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాల్లో వికలాంగుల రిజర్వేషన్ గురించి సమస్యను లేవనెత్తుతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

జిల్లా టీజీఆర్ఎస్ఏ, టీజీటీఏ నూతన కార్యవర్గాలు ఎన్నిక



జిల్లా నూతన కార్యవర్గాల సభ్యులకు సన్మానం

నారాయణపేట: జిల్లా నూతన టీజీఆర్ఎస్ఏ కార్యవర్గాన్ని గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ రాములు, రాష్ట్ర సెక్రటరీలు రమేష్, శ్రీభిక్షంల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా చింత రవి, జనరల్ సెక్రటరీగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, హాజీరా బీబీ, విష్ణు, జాయింట్ సెక్రటరీగా కిరణ్, రామాంజనేయులు, చైతన్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగేంద్రప్రసాద్, ట్రెజరర్ అజహర్ ఖాన్, పబ్లిసిటీ కల్చరల్ సెక్రటరీగా జగన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కాలప్ప, అమర్‌నాథ్, భూపాల్ రెడ్డి, ఆశాబీ, మల్లప్ప, శ్రీనివాస్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా టీజీటీఏ జిల్లా అధ్యక్షులుగా ఎండీ జలీల్, జనరల్ సెక్రటరీగా దయాకర్‌రెడ్డి, కోశాధికారిగా మల్లికార్జునరావు, సభ్యులుగా మల్లారెడ్డి, సింధూజ, అనిల్‌కుమార్, భాస్కర్ , జయరాములు, సతీష్‌లు ఎన్నికయ్యారు. సమావేశంలో టీజీఆర్ఎస్ఏ ఆవిర్భావం ఆవశ్యకత, గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయాలు స్వాగతిస్తూ తీర్మానం చేశారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



ధన్వాడలో రాస్తారోకో చేస్తున్న బీఎస్పీ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నామాన్ని మళ్లీ మళ్లీ స్మరించడం కంటే దేవుడిని స్మరిస్తే ఏడు జన్మలకు సరిపడా స్వర్గమైన దొరుకుతుందని చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా అంబేడ్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో నారాయణపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర హోం మంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆ సంఘం నాయకులు మాట్లాడారు. అత్యున్నతమైనా, గౌరవ ప్రదమైన పార్లమెంట్‌లో తనకున్న మనువాదపు అజ్ఞానపు భావజాలంతో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దేవుడికి మధ్య పోలిక చూపిస్తూ అవమానపరిచిన కేంద్ర హోం మంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని, నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ జాతర కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి ఈశ్వరమ్మ, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకులు చంటి, ప్రజా, కార్మిక, దళిత, అంబేడ్కర్ సంఘం నాయకులు బీ రమేష్, వెంకటప్ప, టి మాధవ్, పాండు, హనుమంతు, శేషు బాలరాజ్, ఎం రాజు, ఎల్లప్ప, కృష్ణమూర్తి, స్వేరో సర్కిల్ కురుమప్ప పాల్గొన్నారు.

- కోస్గి పరిధిలోని గుండుమాల్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ప్రజా సంఘాల నాయకులు రమేష్‌బాబు, బొర్ర వెంకటయ్య, పిరంగి శివన్న, దస్తయ్య, రామకృష్ణ, శ్రీనివాస్, కృష్ణయ్య, నర్సింహులు, పెంటప్ప ఉన్నారు.
- మాగనూర్ మండల కేంద్రంలో అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు సగరం రమేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటాలు ప్రదర్శించారు. మహేష్, భైరంపల్లి నారాయణ, రాఘవేంద్ర, మధు, గోపాల్, మహేష్,పవన్, శంకర్ పాల్గొన్నారు.
- ధన్వాడలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను తక్షణమే మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి వెంకటేష్, మండల అధ్యక్షులు రవియాదవ్, రాజు, బాల్‌రాజు, అశోక్, అరవింద్, కురుమూర్తి, మొగులయ్య, అజయ్‌కుమార్, వెంకటేష్, బాను పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టాలి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో పాలకులు మారినా పాలన తీరు మారలేదని మాజీ ఎమ్మె ల్యే, బీజేపీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు పగడాకుల శ్రీనివాసులు, నాగురావు నామాజీ, కొండయ్య, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కోస్గి రూరల్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన గుండుమాల్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బోగారం గ్రామానికి చెందిన పల్లె లాలప్ప(38) ఈ నెల 14న తన వ్యక్తిగత పనుల నిమిత్తం కోస్గి పట్టణానికి వెళ్లాడు. తిరిగి రాక పోవడంతో బంధువులతో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో లాలప్ప తల్లి పెంటమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు.